క్లుప్తంగా

ఐలోని మల్లన్న జాతరకు రావాలి..

● పోలీస్ కమిషనర్‌ను ఆహ్వానించిన ఈఓ



ఐనవోలు : మల్లికార్జునస్వామి ఆలయంలో సంక్రాంతి సందర్భంగా జరిగే జాతరకు రావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝాను గురువారం ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్వామి వారి చిత్రపటాన్ని, జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆహ్వానించిన వారిలో అర్చకులు పాతర్లపాటి నరేష్, నందనం భాను ప్రసాద్, ఈస్ట్‌జోన్ డీసీపీ పులిగిల్ల రవీందర్, మామునూరు ఏసీపీ తిరుపతి, పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్ ఉన్నారు.

మోటారు దొంగల అరెస్ట్



ఆత్మకూరు : మండలంలోని అక్కంపేట గ్రామానికి చెందిన కడుదుల సంజీవులు అనే రైతు వ్యవసాయ బావి వద్ద సోమవారం రాత్రి విద్యుత్ మోటారు చోరీ అయ్యింది. ఈ మేరకు బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గురువారం పోలీసులు అక్కంపేటలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్కంపేట గ్రామానికి చెందిన పెండ్లి రాజు, అమ్మ రజనీకాంత్‌ను మోటారుతో సహా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. మోటర్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సంతోశ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



గుర్తుతెలియని మృతదేహం

ఆత్మకూరు : గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన సంఘటన మండలంలోని నీరుకుళ్ల శివారులో గల చలివాగులో గురువారం చోటుచేసుకుంది. సీఐ సంతోశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతదేహం వాగులో కనిపించడంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు, పంచాయతీ సిబ్బంది ఆ మృతదేహాన్ని బయటకు తీసి ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతుడి వయస్సు 35 సంవత్సరాలు ఉంటుందని, వీపుపై పచ్చబొట్టు ఉన్నట్లు సీఐ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి జితేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య



రాజయ్య

ఆత్మకూరు : అనారోగ్య సమస్యలు భరించలేక ఓ వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన గురువారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు గ్రామానికి చెందిన పరికిరాల రాజయ్య (50) రెండు సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి అనారోగ్యానికి గురయ్యాడు. దీనికి తోడు ఇతర అనారోగ్య సమస్యలు కూడా ఉండటంతో మనోవేదనకు గురైన ఆయన.. గురువారం ఉదయం ఇంట్లో ఎవరులేని సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య రాజేశ్వరి బయటకు వెళ్లి వచ్చి చూసేసరికి పడిపోయి ఉన్నాడు. దీంతో 108కి సమాచారం అందించగా సిబ్బంది చూసి మృతిచెందిటన్లు నిర్ధారించారు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోశ్ తెలిపారు. మృతుడికి భార్య రాజేశ్వరి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నిర్వాసితులను ఆదుకోవాలని వినతి



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 15వ డివిజన్ గొర్రెకుంట ప్రధాన రహదారి విస్తరణలో ఇండ్లు, భూములు కోల్పోయిన నిర్వాసితులు న్యాయం కోరుతూ కలెక్టరేట్ ఏఓ విశ్వనాథ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మీడియాతో మాట్లాడారు. తమకు 120 గజాల స్థలంతోపాటు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని కోరారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి, తహసీల్దార్ రియాజుద్దీన్‌కు సైతం వినతిపత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో నిర్వాసితులతోపాటు కాంగ్రెస్ నాయకులు ల్యాదల్ల ఆనందం పాల్గొన్నారు.

పల్లెల్లో పంచాయతీ ఎన్నికల చర్చ

● విందులతో సన్నిహిత్యం పెంచుకుంటున్న పలువురు నాయకులు
● మండలంలో 12 జీపీలు, 106 వార్డులు, 16,434 మంది ఓటర్లు
● రిజర్వేషన్ల ఖరారుపై ఆశావహుల తర్జనభర్జన

'ఏం సంగతి బాబాయ్, బాగున్నవా, ఇప్పుడే వచ్చిన పట్టణం నుంచి. చిన్నా ఎటు వెళ్తున్నావ్.. అక్కా బాగున్నారా.. సాయంత్రం కలుద్దాం కాక..' అనే అప్యాయత మాటలు గ్రామాల్లో రాజకీయ నాయకులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఆసక్తి కనబర్చే నాయకుల నోట వినిపిస్తున్నాయి. పట్టణాల్లో స్థిరపడిన పలువురు వివిధ పార్టీల నాయకులు ఇప్పటి నుంచే గ్రామాల బాట పడుతున్నారు.



వేలేరు గ్రామపంచాయతీ కార్యాలయం

వేలేరు : గ్రామపంచాయతీ ఎన్నికలపై గ్రామాల్లో జోరుగా చర్చలు మొదలయ్యాయి. కొంతమంది నాయకులు ఈసారి జరిగే స్థానిక సంస్థల ఎన్నికల బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపడంతో రిజర్వేషన్ల ఖరారుపై తర్జనబర్జన పడుతున్నారు. తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు నిత్యం ప్రజల్లో తిరుగుతూ పరామర్శలు, శుభకార్యాలకు హాజరవుతూ ప్రణాళికలను రూపొందించుకుంటున్నారు. కులగణన ప్రక్రియ పూర్తవడంతో గ్రామాల్లో రిజర్వేషన్లపై జోరుగా చర్చలు నడుస్తుడంగా జనవరి, ఫ్రిబవరి మధ్యలోనే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని చర్చించుకుంటున్నారు. అయితే ఈ క్రమంలోనే గత డిసెంబర్ 31ని మంచి అవకాశంగా తీసుకుని మండలంలోని ఓ గ్రామంలో గల ఓ నాయకుడు యువతకు దావత్ ఏర్పాటు చేసి తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికే ఓటర్ల తుది జాబితా సిద్ధం చేసింది. పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియ కూడా పూర్తి చేసింది. పోలింగ్ కేంద్రాల ఏర్పాటులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలుపాలని ఎంపీడీఓలు అఖిలపక్ష నాయకులతో సమీక్షలు కూడా నిర్వహించారు. ఇక రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడమే తరువాయి బరిలో నిలిచే ఆశావహులు ఇప్పటి నుంచే అవసరమైన అంగబలం, ఆర్థిక బలం సమకూర్చుకుంటున్నట్లు సమాచారం.

గ్రామాల బాట పడుతున్న ఆశావహులు

పట్టణాల్లో స్థిరపడిన మండలంలోని పలువురు నేతలు గ్రామాల బాట పడుతున్నారు. వారంలో రెండు రోజులు గ్రామాల్లో గడుపుతున్నారు. సన్నిహితులతో మంతనాలు చేస్తూ పార్టీలకతీతంగా కార్యకర్తలు, నాయకులతో మాటముచ్చల కలుపుతూ తమకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని, ఎలాంటి అవసరం ఉన్నా చూసుకుంటానని హామీలు ఇస్తున్నారు. కాగా మండలంలోని ఎర్రబెల్లి గ్రామం పాత భీమదేవరపల్లి మండలంలో కలువగా, ఓటర్ లిస్ట్ కూడా భీమదేవరపల్లి మండలంలోకి వెళ్లింది. కన్నారం గ్రామం అక్కన్నపేట మండలంలో చేర్చాలని డిమాండ్ చేయగా ఆ గ్రామానికి సంబంధించిన ఓటర్ లిస్ట్ అక్కన్నపేట మండలానికే వెళ్లే అవకాశం ఉందనే చర్చ జరుగుతుంది. మొత్తానికి పంచాయతీ ఎన్నికల చర్చ షురూ అయ్యింది.

మండలంలో జీపీలు, వార్డులు, ఓటర్ల వివరాలు..

● గ్రామపంచాయతీలు	12
● వార్డులు	106
● స్త్రీలు	8,298
● పురుషులు	8,136
● మొత్తం ఓటర్లు	16,434

ప్రతిఒక్కరూ సోదర భావంతో మెలగాలి

● కుడా ఛైర్మన్ వెంకట్రాంరెడ్డి

నడికూడ : ప్రతిఒక్కరూ సోదర భావంతో మెలగాలని కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ముస్త్యాలపల్లిలో గల హజ్రత్ సయ్యద్ మదార్ షావలి దర్గా ఉత్సవాల్లో పాల్గొని చాదర్‌ను సమర్పించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. దైవం మీద నమ్మకం, మానవులందరూ ఒకటే అనే భావానికి ప్రతీక ఉర్సు అన్నారు. హజరత్ నేర్పిన సూఫీ తత్వాలు, బోధనలు నేటి ప్రజా జీవనానికి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా



హజ్రత్ సయ్యద్ మదార్ షావలికి చాదర్‌తో వెళ్తున్న కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి

ముతవల్లి మహ్మద్ ఖాజఖాద్రి, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డుపై ఇసుక, కంకర పోస్తే చర్యలు



రోడ్డుపై ఉన్న కంకర, మట్టి కుప్పలను తొలగిస్తున్న పోలీసులు

శాయంపేట : రోడ్డుపై ఇసుక, కంకర పోసినా, నిల్వ చేసినా చర్యలు తీసుకుంటామని ఎస్సై జక్కుల పరమేశ్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై ఉన్న కంకర, ఇసుక, మట్టికుప్పలను గురువారం ఎస్సై ఆదేశానుసారం ఏఎస్సై కుమారస్వామి జేసీబీ సహాయంతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఎస్సై పరమేశ్ మాట్లాడుతూ.. ఇళ్లు నిర్మించుకునే వారు రోడ్డుపై కంకర కుప్పలు, మట్టి కుప్పలు, ఇసుక కుప్పలు పోయడంతో వాహనదారులు ప్రమాదాల బారినపడే అవకాశం ఉందన్నారు. ఇళ్లు నిర్మించుకునేవారు కంకర, మట్టి కుప్పలను రోడ్డుకు దూరంగా పోసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

ఎస్సైకి సన్మానం

శాయంపేట : ఎస్సై జక్కుల పరమేశ్‌ను తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి ఆధ్వర్యంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రంతో సత్కరించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు గిద్దమారి సురేష్, ఉద్యమకారుల ఫోరం జిల్లా యూత్ అధ్యక్షుడు కొమ్ముల శివ, నాయకులు కుమారస్వామి ఉన్నారు.

'పట్నం వేస్తే అదనంగా రూ.500 వసూలు'

ఐనవోలు : మల్లన్న ఆలయంలో పట్నం వేస్తే ఒగ్గు పూజారులు రూ.500 అదనంగా వసూలు చేస్తున్నారని వేములవాడకు చెందిన మల్లన్న భక్తుడు చైతన్య వాపోయాడు. ఈఓ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా సిబ్బందిని పంపించినట్లు తెలిపారు. భక్తుల వద్ద నుంచి ఒగ్గు పూజారులు అదనపు వసూళ్లు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దేవస్థానం ఆలయం లోపల పట్నం వేసుకుంటే రూ.300, ఆలయ ఆవరణలో రూ.150 టికెట్లకు చెల్లిస్తుండగా.. అదనంగా ఒగ్గు పూజారులు వసూలు చేయడం అన్యాయమని అన్నారు. అధికారులు దృష్టి సారించాలని కోరారు. ఈ విషయమై ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావును వివరణ కోరగా దేవస్థానం టికెట్ కాకుండా భక్తులు ఎలాంటి రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. భక్తులకు అసౌకర్యం కలిగితే లిఖిత పూర్వకంగా ఈఓ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని తప్పకుండా చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.

జాగ్రత్తలు పాటించాలి

శాయంపేట : సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని యువకులు, చిన్నారులు విద్యుత్ వైర్లకు దూరంగా పతంగులు ఎగురవేయాలని విద్యుత్ శాఖ ఏఈ చందూలాల్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. విద్యుత్ వైర్లకు దగ్గర పతంగులు ఎగురవేస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వైర్లకు, ట్రాన్స్ ఫార్మర్లకు దూరంగా బహిరంగ ప్రదేశాల్లో యువకులు, చిన్నారులు పతంగులు ఎగురవేయాలని సూచించారు.

'దాడి పిరికి చర్య'

కమలాపూర్ : బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి పిరికిపందల చర్య అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి అన్నారు. నలుగురు ఆకతాయిలను బీజేపీ కార్యాలయం మీదకు పంపించి దాడులు చేయిస్తూ కాంగ్రెస్ పార్టీ పైశాచిక ఆనందం పొందుతుందని ఆరోపించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని గుణపాఠం తప్పదని అన్నారు.

పత్తి దళారుల పాలు..

తూకంలో మోసం.. క్వింటాకు 20 కిలోల ఎసరు

● దళారులకు అమ్మి నష్టపోయిన రైతులు
● పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగింత



దళారుల వాహనాన్ని అడ్డుకుని నిలదీస్తున్న రైతులు

వెంకటాపురం(ఎం): వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి ఆరుగాలం శ్రమించి చేతికి వచ్చిన పంట దళారుల పాలైందని అన్నదాతలు లబోదిబోమంటున్నారు. సాగులో ఉన్న భూమి రికార్డులో లేకపోవడంతో పండిన పత్తి పంటను మార్కెట్‌కు తరలించి అమ్ముకోలేక దళారులకు విక్రయిస్తే తూకంలో మోసం చేసి తమ కడుపుకొట్టారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. 45 రోజుల నుంచి ఆత్మకూరుకు చెందిన కొంతమంది దళారులు రెండు ట్రాలీ ఆటోల్లో వెంకటాపురం(ఎం) మండల కేంద్రానికి వచ్చి వీధుల్లో తిరుగుతూ పత్తిపంటను కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో క్వింటా పత్తికి రూ.7,200కు పైగా ధర ఉండగా.. గ్రామాల్లోకి వచ్చిన దళారులు క్వింటా పత్తికి రూ.6,700 నుంచి రూ.6,900 వరకు పెడుతున్నారు. రవాణా ఖర్చులు మిగులుతాయనే ఉద్దేశ్యంతో పాటు పంట అమ్ముకునేందుకు పాస్‌బుక్ లేకపోవడంతో దళారులకు అమ్మాల్సిన దుస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

రిమోట్‌తో కంట్రోల్

ఈక్రమంలో గురువారం ఆత్మకూరుకు చెందిన కొంతమంది దళారులు రెండు వాహనాల్లో వచ్చి పత్తిని కొనుగోలు చేశారు. అందులో ఒక వాహనం పత్తిలోడ్‌తో వెళ్లిపోగా.. మరో వాహనదారులు పత్తిని కొనుగోలు చేస్తున్నారు. పత్తిని కాంటా వేసే సమయంలో వాహనంలో కూర్చున్న ఓ వ్యక్తి రిమోట్ కంట్రోల్‌తో బరువును కంట్రోల్ చేయడాన్ని గమనించిన రైతులు దళారులను పట్టుకుని నిలదీశారు. కాంటాలో 80 కిలోలకు పైగా బరువు రావాల్సిన పత్తి బస్తాలు 60 కిలోల లోపే వస్తుండడంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారు. దళారులను నిలదీయడంతో తప్పు ఒప్పుకున్న దళారులు కొనుగోలు చేసిన పత్తికి క్వింటాకు ఐదు కిలోల చొప్పున అదనంగా డబ్బులు చెల్లిస్తామని చెప్పారు. తూకంలో 20కిలోలు మోసం చేసి 5 కిలోలు ఎలా చెల్లిస్తావంటూ నలుగురు దళారులను, వారి వాహనాన్ని రైతులు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.



రైతులతో మాట్లాడుతున్న ఎస్సై సతీశ్

45 రోజులుగా కొనుగోళ్లు..

45 రోజులుగా రోజుకు ఒక వాహనానికి 30 క్వింటాళ్ల చొప్పున పత్తిని దళారులు కొనుగోలు చేశారు. గతంలో కొనుగోలు చేసిన పత్తి రైతులందరికీ క్వింటాకు 15 కిలోల చొప్పున అదనంగా డబ్బులు చెల్లించాలని రైతులు పోలీస్ అధికారులను కోరుతున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన రైతులతో ఎస్సై జక్కుల సతీశ్ మాట్లాడి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

అభివృద్ధి చూసే పార్టీలో చేరికలు

● ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

దామెర : రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసే పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని ఊరుగొండ గ్రామానికి చెందిన సుమారు 50మంది ఆటో యూనియన్ సభ్యులు, డప్పు కళాకారులు, యువకులు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో ఆటో యూనియన్ ఉపాధ్యక్షులు పోలేపాక భిక్షపతి, నల్ల విజేందర్, ప్రధాన కార్యదర్శి నల్ల రమేశ్‌బాబు, పోలెపాక శ్రీకాంత్, కోశాధికారులు పోలేపాక సుమన్, గూడూరు విజేందర్, కీసర రాజు, పోలేపాక కరుణాకర్, తిక్క శ్రీధర్, రంజిత్, రాజిరెడ్డి, నితిన్, ప్రశాంత్, రమేశ్, డప్పు కళాకారులు నల్ల రామచందర్, విజేందర్, స్వామి, ఐలయ్య, రాజయ్య, సాంబయ్య, సదయ్య, స్వామి, రాజు, యువకులు నరేష్, ప్రవీణ్, మహేష్, సునీల్ ఉన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, రవీందర్, రాంచందర్, మండల యూత్ అధ్యక్షుడు సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

వివేకానంద జయంతిని జయప్రదం చేయాలి

● సిటిజన్ ఫోరం కన్వీనర్ విద్యాసాగర్

పరకాల : ఈనెల 12న వివేకానంద జయంతి, నేషనల్ యూత్ డే సందర్భంగా శుక్రవారం నిర్వహించనున్న ఉత్సవాలను విజయవంతం చేయాలని పరకాల సిటిజన్ ఫోరం కన్వీనర్ డాక్టర్ నాగబండి విద్యాసాగర్ పిలుపునిచ్చారు. సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులకు 'వివేకానంద జీవితం-జాతీయ నిర్మాణంలో యువత పాత్ర' అనే అంశంపై గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సిటిజన్ ఫోరం కన్వీనర్‌తో పాటు సభ్యులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ విద్యాసాగర్ మాట్లాడుతూ.. పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని వివేకానంద జయంతి ఉత్సవాలు శుక్రవారం 11 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణతో పాటు ఏసీపీ సతీశ్‌బాబు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.



వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న విద్యాసాగర్, జయంత్‌లాల్

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటిజన్ ఫోరం సభ్యులు ఆర్‌పీ జయంత్‌లాల్, బెజ్జంకి కరుణాకర్, వీరేశ్‌రావు, చోల్లేటి సునేందర్, పాలకుర్తి తిరుపతి, పున్నం అశోక్, నర్సింగరావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర పనులనుంచి మినహాయించాలి

● టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీరామాంజనేయులు

కమలాపూర్ : మధ్యాహ్న భోజన రికార్డులు తయారు చేయడం, విద్యార్థుల ఆన్‌లైన్ డేటా ఎంట్రీ వంటి బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బత్తిని శ్రీరామాంజనేయులు డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈఓ రాంకిషన్‌రాజు చేతులమీదుగా 2025 నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీరామాంజనేయులు మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు విపరీతమైన బోధనేతర పనిభారం పెరుగుతోందని, ప్రభుత్వం ఉపాధ్యాయులకు అనేక బోధనేతన పనులు అప్పగించడం ద్వారా విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలు కుంటుపడుతున్నాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా రికార్డులు నమోదు చేయాలని టార్గెట్లు పెడుతూ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచుతున్నారని, ఫలితంగా పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయులు బోధనేతర కార్యక్రమాలపై దృష్టి సారించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కౌన్సిలర్ ముత్యాల రఘుపతి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, నూతన పీఆర్సీ వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు రాజు, ప్రధానకార్యదర్శి భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, జిల్లా కార్యదర్శి రమేశ్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజమల్లయ్య, నాయకులు శ్రీధర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



కమలాపూర్ : నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

విద్యార్థులు ఒత్తిడి తగ్గించుకోవాలి

ఆత్మకూరు : పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు ఒత్తిడిని తగ్గించుకోవాలని మానసిక వైద్య నిపుణుడు ప్రహసిత్ సూచించారు. మండలంలోని తిరుమలగిరిలో గల కేజీబీవీలో గురువారం విద్యార్థులకు మానసిక సంసిద్ధతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రణాళికబద్ధంగా పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. మెరుగైన ఆరోగ్యం కోసం పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని, చెడు స్నేహం జోలికి వెళ్లొద్దన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిని డాక్టర్ స్పందన, డాక్టర్ చైతన్య, కేజీబీవీ ఎస్‌ఓ వాసవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ప్రహసిత్

పరకాల డిగ్రీ కళాశాలలో పుస్తకావిష్కరణ



శ్రీనివాస్‌రెడ్డి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

పరకాల : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతు శాస్త్ర సహాయ ఆచార్యుడు డాక్టర్ అన్నెం శ్రీనివాస్‌రెడ్డి రచించిన పుస్తకం ఎన్వీరాన్‌మెంటల్ పొల్యూషన్ అండ్ మేనేజ్‌మెంట్‌ను గురువారం ఆవిష్కరించారు. ప్రకృతిలో భాగమైన ఎన్వీరాన్‌మెంట్ అంశంపై మరింత పరిశోధన చేసి మరిన్ని పుస్తకాలు రచించాలని పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంతోశ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బి.విజయ్‌పాల్‌రెడ్డి, డాక్టర్ కె.రామకృష్ణ, డాక్టర్ టి.భీంరావు, డాక్టర్ టి.కల్పన, బి.మహేందర్‌రావు, డాక్టర్ జి.పావని, ఎం.సమ్మయ్య, డాక్టర్ అలిశాల అశోక్, డాక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ జి.స్వప్న, డాక్టర్ డి.సంజయ్‌కుమార్, డి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు అధికారుల సర్వే

దామెర : మండల కేంద్రంలో టీఎస్ రెడ్కో డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్ కోసం రెవెన్యూ అధికారులు గురువారం సర్వే నిర్వహించారు. మండల కేంద్రంలోని గుట్టల్లో ప్రభుత్వ భూమిని పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సర్వేలో స్థానిక తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, ఆర్‌ఐలు సంపత్, భాస్కర్‌రెడ్డి, సర్వేయర్ స్టాలిన్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లికి చెందిన సాంబాచారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ తరపున నాయకులు గురువారం రూ.10 వేల సాయం అందజేశారు. తొలుత సాంబాచారి చిత్రపటానికి నివాళుల ర్పించారు. నాయకులు తదితరులు ఉన్నారు.